క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని డాక్టర్స్ కాలనీలోని శ్రీ బాలాజీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో సోమవారం న్యూరో కేర్ విభాగంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి యాజమాన్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్స్, పక్షవాతం, బీపీ, షుగర్, మెదడువాపు, మూతివంకర, తల తిరుగుట, స్పృహ కోల్పోవటం, వెన్నుపూస, మెడనొప్పి సమస్యలకు న్యూరో ఫిజిషియన్ డాక్టర్ అభిషేక్ వైద్య పరీక్షలు చేస్తారని ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాఠశాలల్లో నీటి గంటలు మోగించాలి

మిర్యాలగూడ టౌన్ : ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున అన్ని పాఠశాలల్లో నీటి గంటలు మోగించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోజుకు మాములు కంటే నాలుగు, ఐదు డిగ్రీల ఉష్ణోగ్రత ఎక్కువ నమోదు అవుతుందని, ఎండా కాలంలో శరీరంలో నీటి నిలువలు తగ్గడం వలన చాలా మంది విద్యార్థులు అస్వస్థతలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికే కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఈ విధానాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. తప్పనిసరిగా నీటి గంటలు మోగించాలన్నారు.

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

నల్లగొండ టూటౌన్ : ప్రతి విద్యార్థి తనకు నచ్చిన క్రీడను ఎంపిక చేసుకుని నిరంతరం సాధన చేయడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగవచ్చని వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ అన్నారు. ఛత్రపతి శివాజీ ఫుట్‌బాల్ లీగ్స్ పోటీలను ఆదివారం ఔట్ డోర్ స్టేడియంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులకు ఫుట్‌బాల్ పోటీల్లో శిక్షణ ఇచ్చి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం టీఆర్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు లోకబోయిన రమణముదిరాజ్ క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బొమ్మపాల గిరిబాబు, పాముల అశోక్, కోచ్ మద్ది కరుణాకర్, అంబటి ప్రణీత్, సత్య, గణేశ్, వెంకట్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ భవన్‌లో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

నల్లగొండ టూటౌన్ : రంజాన్ మాసం సందర్భంగా జిల్లా పెన్షనర్స్ భవన్‌లో ఆదివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి పెన్షనర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా హిందూ ముస్లింల ఐక్యతకు నిదర్శనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జెల్లా శ్రీశైలం, గౌరవ అధ్యక్షుడు ఎన్. రంగయ్య, కోశాధికారి అమృతారెడ్డి, సభ్యులు ఎస్.ఆంజనేయులు, ముత్యాల కృష్ణయ్య, మారం సంతోష్‌రెడ్డి, ఎ.యాదగిరి, ఎం.వెంకట్‌రెడ్డి, జి.సత్యం, వై.వాసుదేవ్, పుల్లయ్య, రామలింగం, టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు నాగిల్ల మురళి, కార్యదర్శి శేఖర్‌రెడ్డి, టీజీఓ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సేవలను పునరుద్ధరించాలి

మఠంపల్లి : మండలంలో మేజర్ గ్రామపంచాయతీ అయిన రఘునాథపాలెంకు కోదాడ ఆర్టీసీ అధికారులు బస్సు సేవలను పునరుద్ధరించాలని పీఏసీఎస్ మండల చైర్మన్ జవ్వాజి రామచంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి ఎండీ.అక్బర్‌లు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. కోదాడ డిపోకు చెందిన బస్సు గతంలో హుజూర్‌నగర్, మఠంపల్లిల మీదుగా రఘునాథపాలెం నుంచి గుండ్లపల్లి వరకు నడిచేదన్నారు. గత మూడు నెలలుగా ఆర్టీసీ అధికారులు బస్సు సేవలు నిలిపి వేయడంతో మండల కేంద్రానికి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నామని, కావున వెంటనే బస్సును పునరుద్ధరించాలని కోరారు. వారి వెంట సయ్యద్‌నిజామ్, మాజీ ఎంపీటీసీ మేడి సామేలు, నాగుల్‌మీరా, పసుపులేటి జానయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కోతలకు చెక్ పెట్టేలా..

- విద్యుత్ శాఖ చర్యలు
- సబ్‌స్టేషన్లలో అదనపు ట్రాన్స్‌ఫార్మార్ల ఏర్పాటు
- పనులు ప్రారంభించిన అధికారులు


ప్రధాన విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అదనంగా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉంచిన ట్రాన్స్‌ఫార్మర్


అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

మిర్యాలగూడ అర్బన్ : వేసవి తాపానికి ఉపశమనం కోసం ప్రజలు కూలర్లు, ఏసీల వినియోగం పెరగడంతో విద్యుత్ వినియోగం పీక్ స్టేజికి పెరిగింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడు పడి తరచూ ఫీజులు ఎగిరిపోతున్నాయి. దీంతో కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో పాటు కొన్ని ఏరియాల్లో లో ఓల్టేజ్‌తో కూడిన విద్యుత్ సరఫరా అవుతుండటంతో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతుంది. ఒక్కోసారి రాత్రి సమయంలోనూ ఎక్కువ ఫీజులు కొట్టేస్తుండటంతో ప్రజలతో పాటు విద్యుత్ సిబ్బందికి సైతం తీవ్ర తలనొప్పిగా మారింది. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి చెక్ పెట్టడంతో పాటు విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ఇచ్చేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టారు. అందులో భాగంగా మిర్యాలగూడ పట్టణంలోని ప్రధాన విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఇప్పటికే ఉన్న 16 మెఘావాట్ల ట్రాన్స్‌ఫార్మర్లకు అదనంగా మరో 5 మెఘావాట్ల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు రంగంలోకి దిగారు. అనుకున్నదే తడవుగా తక్షణమే ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో పనులను సైతం ప్రారంభించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పనులను ప్రారంభించిన అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు పనుల్లో భాగంగా బ్రేకర్లను బిగించారు. గత మూడు రోజులుగా మధ్యాహ్నం వరకు వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేసి పనులు చేపట్టారు. అదనంగా 5మెఘావాట్ల సామర్థ్యంతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం వలన తరుచూ ట్రిప్ అయి ఫీజులు కొట్టేయడం ఉండదని తద్వార ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా విద్యుత్ సరఫరాను నిరంతరం అందించవచ్చని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొంటున్నారు.

ఉచిత విద్యుత్ తోనూ పెరిగిన లోడ్

కాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజలకు 2వందల యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందించాలనే నిర్ణయంతో ఆ దిశగా విద్యుత్ అధికారులు కూడా చర్యలు తీసుకున్నారు. అయితే ఉచిత విద్యుత్ ప్రవేశపెట్టిన నాటి నుంచి నేటి వరకు కూడా కొంత విద్యుత్ వినియోగం పెరిగిందని అధికారులు తెలిపారు. ఉచిత విద్యుత్ ప్రవేశ పెట్టక ముందు సదరు వినియోగదారుడు వంద యూనిట్లు కూడా వాడని వారు నేడు 200యూనిట్లు వరకు అవకాశం ఉందని ఆ మేరకు విద్యుత్‌ను వాడుకునూ వీలుందనే భావనతో కరెంట్ వాడకాన్ని పెంచారని అధికారులు పేర్కొంటున్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం



ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండటంతో విద్యుత్ వినియోగం పెరిగింది. దీంతో వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఇప్పటికే అన్ని ఏరియాల్లో 11కేవీ విద్యుత్ లేన్ల కింద ఉన్న చెట్లను తొలగించాం. ఈ నెలలో విద్యుత్ వినియోగం అధికంగా ఉండటంతో లోడ్‌ను తట్టుకోలేక తరుచూ ఫీజులు ఏగిరిపోతున్నాయి. దీంతో లోడ్‌ను తట్టుకేనేలా మరో 5మెఘావాట్ల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

– కోడిరెక్క రవికుమార్, ట్రాన్స్‌కో ఏడీఈ మిర్యాలగూడ

'నల్లగొండ పార్లమెంట్'లో కాషాయ జెండా ఎగరాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగం వర్షిత్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : నల్లగొండ పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని భారీ మోజార్టీతో గెలిపించి కాషాయ జెండాను ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో బృందావన్ గార్డెన్‌లో నిర్వహించిన విజయ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా పట్టణం, మండల, బూత్ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మోదీ ప్రతి నిధిగా మీ ముందుకు పార్లమెంట్ అభ్యర్థిగా నిలిచిన శానంపూడి సైదిరెడ్డిని భారీగా గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాలన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీవైపు చూస్తున్నాయన్నారు. ఒక వైపు కాంగ్రెస్ పార్టీ, మరో వైపు బీఆర్ఎస్ పార్టీలో కుటుంబ పాలన కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పులి విద్యాసాగర్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు రేపాల పురుషోత్తంరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎడ్ల రమేష్, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొండేటి సరిత శేఖర్, అసెంబ్లీ నియోజకవర్గ ప్రభారీ గోగిరెడ్డి లచ్చిరెడ్డి, బంటు సైదులు, వెంకట్‌రెడ్డి, నాగిరెడ్డి, సీతారాంరెడ్డి, రమాదేవిశ్యాం, అశోక్‌రెడ్డి, రాజీరెడ్డి, లక్ష్మారెడ్డి, మేడీ నవీన్, రమణ పాల్గొన్నారు.

నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అబ్జర్వర్‌గా సలీం



మిర్యాలగూడ : నల్ల గొండ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్‌గా పట్టణానికి చెందిన ఎం ఏ.సలీం ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం ఏఐసీసీ మైనార్టీ ఉపాధ్యక్షుడు ఫర్హాన్ అజ్మి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను తప్పకుండా పాటిస్తూ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రఘువీర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన కాంగ్రెస్ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హనుమాన్ విజయ యాత్ర కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 23న మిర్యాలగూడలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వీర హనుమాన్ విజయ యాత్ర కరపత్రాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీర హనుమాన్ విజయ యాత్రను శాంతియుతంగా నిర్వహించాలన్నారు. అనంతరం విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. అనంతరం బి అన్నారం గ్రామానికి చెందిన పడిగపాటి నాగిరెడ్డి, అంబటి లక్ష్మారెడ్డి, దామేర మధుల ఆధ్వర్యంలో 20మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వారి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ విభాగం కార్యదర్శి గంజి సుధాకర్, జిల్లా సహకోశాధికారి తల్లం వెంకన్న, నగర కార్యదర్శి నాంపల్లి రామ్‌కుమార్, సహాయ కార్యదర్శి జమ్మిచెట్టి వేణు, నగర కోశాధికారి రాంప్రసాద్, నగర సత్సంగ ప్రముఖ్ రాపర్తి శ్రీనివాస్, గౌరు ప్రవీణ్‌కుమార్,హనుమాన్ చాలీసా నాగయ్య, సహ ప్రముఖ్ పోలే యాదయ్య, నగర విస్తార్ నాగరాజు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శైలజ సేవలు అభినందనీయం


శైలజను సన్మానిస్తున్న ఉద్యోగులు

నల్లగొండ టౌన్ : జిల్లాలో వివిధ హోదాల్లో ప్రజలకు, నారాయణపేట జిల్లా పరిషత్ సీఈఓగా శైలజ చేసిన సేవలు మరువలేనివని నల్లగొండ జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన నారాయణపేట జెడ్పీ సీఈఓ శైలజ, లింగయ్య దంపతులను ఆదివారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, మేడ్చల్ డీసీఓ శ్రీనివాసమూర్తి, భూమికొలతల శాఖ ఏడీ శ్రీనివాస్, మోహన్‌రావు, గూడ వెంకటేశ్వర్లు, జి.వెంకట్‌రెడ్డి, జెల్లా శ్రీశైలం, రావిరాల నర్సయ్య, పున్న అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

గోడ నిర్మాణాన్ని నిలిపివేయాలి


మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

నల్లగొండ టౌన్ : చర్లపల్లి గ్రామంలో అంబేద్కర్ జగ్జీవన్‌రామ్ విగ్రహాలు కనపడకుండా అడ్డుగా నిర్మిస్తున్న గోడను వెంటనే నిలిపివేయించాలని షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బొడ్రాయి సాకు చెప్పి విగ్రహాలు కనపడకుండా చేయడాన్ని యావత్ దళిత సమాజం ఖండిస్తోందన్నారు. ఈ సమావేశంలో రేఖల సైదులు, కర్నాటి యాదగిరి, ఈర్ల ప్రసాద్, పెరిక అంజయ్య, బొజ్జ పాండు, వేణు, శేఖర్, పాల్గొన్నారు.

పక్షుల దాహార్తి తీర్చేలా..


సాగర్ రోడ్డులో డివైడర్ల మధ్య ఏర్పాటు చేసిన నీటి తొట్టి

మిర్యాలగూడ టౌన్ : ఎండి తీవ్రత అధికంగా ఉండటంతో వివిధ రకాల పక్షులు, కుక్కలతో పాటు ఇతర జీవులు దాహార్తిని తీర్చేందుకు మున్సిపల్ కమిషనర్ ఎండీ యూసుఫ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ బకెట్లల్లో నీటి కులాయిలను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలోని సుమారు 30 నుంచి 50 ప్రాంతాలను గుర్తించి ప్లాస్టిక్ బకెట్ల ద్వారా నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో అన్నీ ప్రాంతాల్లో వేడి ఎక్కిన నీటిని తొలగించి చల్లటి నీటిని ఏర్పాటు చేయడం పైపలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు


మాట్లాడుతున్న పల్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ రాంరెడ్డి

హాలియా : విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని పల్‌రెడ్డి ఫౌండేషన్ రాంరెడ్డి, సీఈఓ చైర్మన్ శాంతిపాల్‌రెడ్డి అన్నారు. పల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని రైతువేదిక భవనంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల అభ్యాసకుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి పేద విద్యార్థినికి అక్షరజ్ఞానాన్ని అందించాలని ఉద్దేశంతో పల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగార్జున సాగర్ నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో బోధకులను ఏర్పాటు చేసి మూడేళ్లుగా పేద పిల్లల కోసం రాత్రి బడులు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతల్లో ఉన్న పేద పిల్లలకు ఉచిత విద్యను అందించి వారి బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి పల్‌రెడ్డి ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పల్‌రెడ్డి ఫౌండేషన్ ప్రొఫెసర్లు యాదగిరిరెడ్డి, నరసింహారెడ్డి, వివిధ మండలాల కోఆర్డినేటర్లు రమేష్ రెడ్డి, గుండెబోయిన అంజి యాదవ్, మేదరి శేఖర్, రిజ్వాన్ బాబా నరసింహ, సునిత రెడ్డి, వంగూరు శ్రీనివాస్, వివిధ గ్రామాల అభ్యాసకులు తదితరులు పాల్గొన్నారు.

శోభన్‌బాబుకు సాహితీ కళాసేవ ఉగాది పురస్కారం


అవార్డు అందుకుంటున్న కొండూరు శోభన్‌బాబు

హాలియా : అనుముల మండలంలోని పేరూర్ గ్రామానికి చెందిన లయన్ రీజియన్ చైర్ పర్సన్ నల్లగొండ వాసవీ క్లబ్ కొండూరు శోభన్‌బాబు సాహితీ కళాసేవ క్రోధినామ సంవత్సర ఉగాది పురస్కారం అందుకున్నాడు. సామాజిక సేవారంగంలో విశిష్ట సేవలందించిన కొండూరు శోభన్‌బాబు సేవలను ఇందిరా ఆర్ట్ ఫౌండేషన్ గుర్తించింది. ఉగాది పండుగ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హైదరబాద్‌లోని శ్రీ శారద కల్చరల్ లైవ్ స్టూడియోలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీ సముద్రాల వేణుగోపాల్‌చారి, మనిక్ తేజ శంకర నారాయణ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నాడు, శోభన్‌బాబు సాహితీ సేవా ఉగాది పురస్కారం అవార్డు అందుకోవడంపై జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరమల్ల కృష్ణయ్య, కొండూరు గణేష్, సంఘం నాయకులు వెంపటి శ్రీనివాస్, మంచుకొండ వెంకటేశ్వర్లు, వాసవి క్లబ్ జోన్ చైర్మన్ బచ్చు సతీష్, పట్టణ అధ్యక్షుడు కొత్తమాసు శ్రీనివాస్, కుక్కడపు రమేష్, శేఖర్, సముద్రాల శ్రీనివాస్ సుబ్బారావు, బచ్చు వెంకన్న, కృష్ణమూర్తి, యాద ఈదయ్య, దేవేందర్ హర్షం వ్యక్తం చేశారు.

మిషన్ భగీరథ నీటిని ప్రతి రోజూ సరఫరా చేయాలి


మొల్కపట్నంలో మహిళలతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న వైస్ ఎంపీపీ గోవర్ధని

వేములపల్లి : వేసవికాలంలో ప్రజల ఇబ్బందులను గుర్తించి అధికారులు మిషన్ భగీరథ నీటిని ప్రతి రోజూ సరఫరా చేయాలని వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని అన్నారు. ఆదివారం మండలంలోని మొల్కపట్నం గ్రామంలో ఆమె మహిళలతో కలిసి బిందెలతో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. గ్రామాల్లో వేసవికాలంలో తాగునీటి ఇబ్బంది తీవ్రంగా ఉందని అన్నారు. గ్రామంలో మూడు రోజుల కొకసారి, ఏడు రోజులకొకసారి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి వేసవికాలంలో ప్రతిరోజూ భగీరథ నీటిని విడుదల చేసి ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యంలో కళాకారులది కీలక పాత్ర


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : సాంస్కృతిక పునరుజ్జీవం నుంచి మొదలుకొని నేటి సమాజం వరకు అనేక మార్పులకు కళా రంగమే దోహద పడిందని, వంద మాటలకన్నా ఒక పాట ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ స్వరాభిషేకం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తమ్మడబోయిన అర్జున్, పాదిల శ్రీనివాస్, నాయకులు జలంధర్‌రెడ్డి, మర్రి ఎలియాస్, వెంకన్న, సత్యనారాయణ, సరస్వతి, మౌనిక, అంబటి నాగయ్య, కస్తూరి ప్రభాకర్, కొండల్‌రెడ్డి, దాసరి రమణ, లక్ష్మయ్య, సైదాచారి, సత్యపైళ్ల పాల్గొన్నారు.

పంచాంగం ఆవిష్కరణ

నల్లగొండ రూరల్: పట్టణంలోని ఆర్జాలబావిలో ఆదివారం క్రోధి నామ సంవత్సరం పంచాంగాన్ని భక్తాంజనేయ సేవా సంస్థ ఫౌండర్ సిరిప్రగడ శ్రీనివాసశర్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుధాకర్, నవీన్‌శర్మ, రమణారావు, నర్సింహ, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, సైదులు, దామోదర్, జయప్రద, భరత్‌కుమార్, హరికృష్ణ, రాంబాబు, వసంత, రమణారావు పాల్గొన్నారు.

కేటీఆర్.. భాష మార్చుకోవాలి

నేరేడుచర్ల : మాజీ మంత్రి కేటీఆర్ తన భాషను మార్చుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు అన్నారు. ఆదివారం నేరేడుచర్లలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేటీఆర్ అధికారం కోల్పోయిన బాధలో రాష్ట్ర ముఖ్యమంత్రిని గుంపు మేస్త్రి అని, ప్రధాన మంత్రిని తాపీ మేస్త్రి అని సంబోధించడం ఆయన అవివేకమన్నారు.

రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : పూలే, అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 13న నిర్వహించనున్న పూలే అంబేద్కర్ జన జాతర, రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక దొడ్డి కొమురయ్య భవన్‌లో జన జాతర కరపత్రాలను నాగార్జున ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గాదె నర్సింహ, రవీందర్, రవి, సుదర్శన్, ప్రభాకర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఘనంగా ఈదమ్మ పండుగ


బోనాలతో వెళ్తున్న మహిళలు

డిండి : మండల పరిధిలోనిటి.గౌరారం, వావిల్‌కోల్ గ్రామపంచాయతీ పరిధిలోని వడ్డెరగూడెంలో ఆదివారం భక్తులు ఈదమ్మ బోనాల పండుగ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బోనమెత్తిన మహిళలు డప్పుల చప్పుళ్ల మధ్యన గ్రామ పుర వీధుల గుండా దేవాలయానికి చేరుకొని అమ్మ వారికి నైవైత్యం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓర్సు అంజయ్య, బత్తుల వెంకటయ్య, బాతుల శ్రీను, వెంకటేశ్, గణేష్, తిర్పతయ్య, జగన్, హన్మంతు, రాములు, లక్ష్మి, ఈశ్వరమ్మ, ఈదమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో శ్రీవారి సేవకు తరలివెళ్లిన భక్తులు

మిర్యాలగూడ టౌన్ : ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారి సేవలను అందించేందుకు ఆదివారం పట్టణానికి చెందిన భక్తులు తరలివెళ్లారు. 46 మంది మూడు బృందాలుగా సేవలను అందించేందుకు తరలివెళ్లారు. తరలివెళ్లిన భక్తులలో కీర్తి అశోక్, చిదేళ్ల నాగేశ్వర్‌రావు, రాజ్యలక్ష్మి, రాజారాం, సన్నీ, శ్రీనివాస్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా.. పకడ్బందీగా

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో ముమ్మరంగా వాహనాల తనిఖీ
- ఎన్నికల నిబంధనలు పాటించాలంటున్న పోలీసులు
- ఇప్పటి వరకు రూ.40లక్షలు సీజ్


చింతపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ(ఫైల్)

దేవరకొండ : కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసిన వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయకుండా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటికే పోలీస్‌శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు చెక్‌పోస్టుల వద్ద నిబంధనల మేరకు నిఘా పెంచారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటికే పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు.కాగా ఎన్నికలు సమీపిస్తుండడంతో అన్ని పార్టీల నేతలు ఇప్పటికే ప్రచారాలు చేసేందుకు సన్నద్ధమయ్యారు.పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలో గల పోలీస్ స్టేషన్ల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు.దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని డిండి, మాల్ పట్టణాల వద్ద రెండు అంతర్ జిల్లా చెక్‌పోస్టులతో పాటు ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి సరిహద్దు ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత నడుమ నిఘా పెంచినట్లు పోలీసు అధికారులు పేర్కొంటున్నారు.

వాహనాల తనిఖీలకు ప్రత్యేక బృందాలు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో చెక్‌పోస్టులతో పాటు నగదు తరలిస్తున్నట్లుగా అనుమానం ఉన్న వాహనాలను తనిఖీ చేసేందుకు ఎన్నికల అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలోని ఒక్కో మండలంలో రెండు బృందాల వరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం రూ.50వేలకుపైగా నగదు వెంట ఉండి ఎలాంటి ఆధారాలు లేని పక్షంలో సీజ్ చేస్తున్నారు. వాటికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలు చూపిస్తే జిల్లా ఎన్నికల అధికారుల నిర్ధారణ అనంతరం నగదును వాపస్ చేస్తారు.

రూ.40లక్షలు సీజ్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు చేపట్టిన విస్తృత వాహన తనిఖీల్లో పలు చోట్ల డబ్బు పట్టుబడడంతో అధికారులు విచారణ నిర్వహించి నగదు సీజ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు డివిజన్ పరిధిలో దాదాపుగా రూ.40లక్షలు నగదును సీజ్ చేసినట్లు దేవరకొండ డీఎస్పీ గిరిబాబు తెలిపారు.

నిబంధనలు తప్పనిసరి



ఎన్నికల సంఘం నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి.ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు ముమ్మరం చేశాం. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ స్టాటిక్ నిఘా బృందాలు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు పనిచేస్తున్నాం.ఎన్నికలకు విఘాతం కలిగించే వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటాం.

– గిరిబాబు, డీఎస్పీ, దేవరకొండ